# పెరటి గుమ్మం

పెరటి గుమ్మం తలుపు తీయగానే చిన్న సందు. ఆ సందు ఎదురుగా ఇల్లు వీరయ్యగారిది.

పెరటి గుమ్మం తలుపు తీసి 'ఒదినమ్మా వస్తున్నావా' అంది యశోదమ్మ సిగలో మల్లె పూలదండ సరిచేసుకుంటూ.

'ఒక్క నిముషం వచ్చేస్తున్నా' అంటూ రెండు పెద్ద సంచులు, ఓ చేతిలో ప్లాస్టిక్ బుట్ట పట్టుకుని బయటకొచ్చింది శాంతమ్మ.

శాంతమ్మ యశోదమ్మ కలిసి సందు చివరదాకా వెళ్ళి బస్సెక్కారు. నాలుగు స్టాపులయేసరికి బస్సు సికింద్రాబాదు స్టేషన్ దగ్గర ఆగింది...

'నడుము నొప్పి... నిన్నంతా డాబామీద కూచుని గుమ్మడి కాయ వడియాలు పెట్టాను... కూచుని అంతసేపు వుండేసరికి నడుం పట్టేసింది...' అంది యశోదమ్మ జాగ్రత్తగా రోడ్డు దాటుతూ.

మెద్రాసులో వున్న మూడో కొడుకు ఏదో పని మీద హైదరాబాదొచ్చాడు. ఆ అబ్బాయికి వడియాలు ఇష్టమని కష్టపడి పెట్టింది యశోదమ్మ.

శాంతమ్మ యశోదమ్మ బసెక్కి ఇల్లు చేరారు. కూరల సంచులు కింద గుమ్మరించారు.

'ఇదిగో ఈ అరటి కాయలు మా అమ్మాయికి ఇష్టం లేదు వదినా..' ఇవి నువ్వు వుంచుకుని ఆ గోబీ పువ్వు ఇటియ్యి' అంది శాంతమ్మ.

'వస్తా... చిట్టి తల్లీ... ఈ సంచీ కాస్త ఆ గుమ్మంలో పెట్టు' అంది యశోదమ్మ, శాంతమ్మ కూతురు కృష్ణవేణితో.

పెరటి తలుపు తీసుకుని లోపలకొచ్చి కూరల సంచి లోపల పెట్టింది కృష్ణవేణి.

'నువ్వు, అత్తయ్య ఇలా బసెక్కి వెళ్ళి కూరలు తేస్తుంటే ఏం బాగాలేదు. వీధిలో కొచ్చినవి కొనుక్కోవచ్చుగా' అన్నాడు యశోదమ్మ పెద్ద కొడుకు శ్రీరామ్.

'వీధిలో మండిపోతున్నాయి... అంది యశోదమ్మ.

'ఇదిగో. చిట్టి తల్లీ... మా అన్నయ్యకియ్యి. నిమ్మకాయంటే చాలా ఇష్టం - నిన్ననే కలిపాను' అంటూ చిన్నగిన్నెలో పెట్టి మూత పెట్టిచ్చింది యశోదమ్మ.

ముందు గదిలో టి.వి. చూస్తున్న రాధిక అంతా గమనిస్తూనే వుంది. ఆ పెరటి గుమ్మం తలుపు చూస్తేనె కోపం గొంతు దాకా నిండి పోతుంది రాధికకి. అయితే పెరటి గుమ్మం నలభై ఏళ్ళుగా వున్నది.

ఆ గుమ్మంలోంచి ఈ గుమ్మంలోకి, ఈ గుమ్మంలోంచి ఆ గుమ్మంలోకి అటు ఇటు తిరుగుతూ శాంతమ్మ యశోదమ్మేకాదు, వాళ్ళ పిల్లలు, మనుమలు కూడా కనిపిస్తుంటే రాధికకి మహా చిరాకు. ఇరుగు పొరుగులు స్నేహాలు, అప్యాయతలు, అనురాగాలు - ఇలాంటివెన్నో ఎంతో విలువైనవని గ్రహించలేని రాధికకి ఆ ఇంటి పెరటి తలుపు పైన కోపం మరీ మరీ పెరిగిపోయింది. ఢిల్లీలో రెండు రూముల ప్లాటులో వుండి, అమ్మ, నాన్న తను, తమ్ముడు తప్ప మరొకరితో సంబంధం లేదనుకుంటూ ఇరవై ఎనిమిదేళ్ళు గడిపిన రాధికకి, అత్తవారిల్లు ఎంతో పెద్దదిగా, విశాలంగా వున్నా ఆ ఇంట్లో నచ్చనిది ఆ పెరటి గుమ్మమే.

రాత్రి తొమ్మిది దాటింది. రాధిక టి.వి.. సీరియల్ శ్రద్ధగా చూస్తోంది. అత్తగారు యశోదమ్మ లోపల వంటింట్లో ఏదో సర్దుతోంది.

పెరటి తలుపు కొడుతున్నారెవరో - రాధికకి వినిపించింది కానీ వినిపించనట్టు ఊరుకుంది. ఇంకా తలుపు చప్పుడవుతూనే వుంది. ఈ మధ్య చెముడు రాటంతో ఓ పట్టాన వినిపించలేదు ఆ చప్పుడు యశోదమ్మకి.

రాధిక విసుక్కుంటూ తలుపు తీసింది.

'అత్తయ్య లేదా' కృష్ణవేణి లోపలకొచ్చింది రాధిక మాట్లడకుండా వెళ్ళి టి.వి. దగ్గర కూచుంది.

'అమ్మ కొంచెం పెరుగుంటే ఇమ్మంది - మామయ్య ఊరినించి వచ్చాడు... మా యింట్లోది తోడుకోలేదింకా" అంది కృష్ణవేణి.

యశోదమ్మ చేస్తున్న పని ఆపి, గిన్నె నిండా పెరుగు నింపి మూత పెట్టి యిస్తూ, 'ఉంటాడా మామయ్య, రేపొచ్చి చూస్తాను' అంది.

కృష్ణవేణి గిన్నె పట్టుకెళ్ళడం, యశోదమ్మ పెరటి తలుపు మూయడం కనిపెడుతూనే వుంది రాధిక.

"చూస్తున్నారా" అంది ఎదురుగా కుర్చీలో కూచుని ఆవులిస్తున్న భర్త శ్రీరామ్‌తో.

ఏముంది చూడ్డానికి' - అన్నాడు..

'అదేమరి - పెరుగని, పాలని, పేపరని, సిగ పిన్ను అని - ఇలా అన్నిటికీ ఆ తలుపు తోసుకు వచ్చి తీసుకు పోటమే... 'రాధిక భర్త ముఖంలోకి చూసింది.

'ఊ' -

ముఖ్యమయిన విషయం చెప్పాలనుకున్నా -

'ముఖ్యమయిన విషయమా' అన్నాడు శ్రీరామ్ కుర్చీలోంచి అటు ఇటు కదిలి.

'మీరేమీ పట్టించుకోరు - నేనేదన్నా అంటే కోపం'

'సరే, చెప్పు ముందు' రాధిక టి.వి. ఆపేసింది. భర్త దగ్గరగా కుర్చీ జరుపుకుంది.

'మీ శ్రీను, ఆ కృష్ణవేణి వ్యవహారం నేను గమనిస్తూనే వున్నాను. నిన్న ఆఫీసునించి నేను వస్తుంటే, కృష్ణవేణిని స్కూటర్ మీద కూర్చోపెట్టుకుని ఇంటి దగ్గర దింపాడు... రాధికా ఇంకా ఏదో చెప్పబోయింది.

'చూడు ఇలాంటి మాటలు ఇంకోసారి నాకు చెప్పద్దు. నేను వినను - ఆ కుటుంబానికి ఈ కుటుంబానికి తరతరాల స్నేహం, అనుబంధం - అమ్మ, అత్తయ్య ఒకరికొకరు ప్రాణం - కష్టాలలో, సుఖాలలో వాళ్ళు ఒకళ్ళకొకళ్ళు తోడు నీడలా జీవిస్తున్నారు. శ్రీరామ్ మాట పూర్తి చేయలేదు ఇంకా...

'తోడు, నీడ, గోడ, తలుపు - ఇవన్నీ సరే, నేను చెప్తోన్నదొకటి - మీరు మాట్లాడే దొకటీ - మీ తమ్ముడు ఆ కృష్ణవేణి...' రాధిక మళ్ళా రెట్టించింది.

'ఇటు విను... మళ్ళా చెప్తున్నా... ఆ ఇంట్లో వున్న వాళ్ళందరూ మా తోబుట్టువులే - ఈ ఇంట్లో వున్న వాళ్ళందరూ వీళ్ళతోబుట్టువులే... నువ్వు అనవసరమైన తగవు పెట్టకు -' శ్రీరామ్ గొంతులో కోపం ధ్వనించింది.

రాధిక మూతి ముడుచుకుని 'మీరే వింటారుగా' అంది కోపంగా.

వారం రోజులనుంచి శాంతమ్మ గారింట్లో ఏదో సందడి. పెరటి తలుపు వేసి వుంచటమే తక్కువయిపోయింది. అత్తగారు యశోదమ్మ ఈ ఇంట్లోకన్నా ఆ ఇంట్లో ఎక్కువకాలం గడుపుతోంది.

రాత్రి భోజనాలు చేస్తున్నారంతా యశోదమ్మ ఇంట్లో.

'ఈ గిన్ని మనది కానట్టుందే' అంది రాధిక డైనింగ్ టేబుల్ మీదున్న గుండ్రని స్టీలు గిన్నె వంక చూస్తూ.

'ఆ గిన్నెతో శాంతమ్మ పాయసం పంపింది. ఒరేయ్ శ్రీనూ, విన్నావా ఇది' అంది యశోదమ్మ.

'శాంతమ్మత్తయ్య ఇంట్లో ఏమిటీ హడావిడీ' అన్నాడు శ్రీరామ్.

'పెళ్ళి' అంది యశోదమ్మ

'నీకూ తెలుసుగా ఆ చంద్రం

'ఆ - అమెరికాలో ఇంజనీరు చదువు. అత్తయ్య వాళ్ళ తమ్ముడు కొడుకేగా' అన్నాడు శ్రీను.

'ఆ - వాడే, ఇరవై రోజులుంటాడట. పెళ్ళి చేసుకుని పిల్లని కూడా తీసుకెళ్ళి పోతాడుట.... అదేదో వీసా వుందిట - నాకు తెలియనివన్నీ' అంది యశోదమ్మ కొడుకు కంచంలో అన్నం వడ్డిస్తూ.

'మొదటినుంచీ అనుకున్న సంబంధమేగా అది... చిట్టి తల్లి అదృష్టవంతురాలు' అంది యశోదమ్మ మళ్ళా.

'చిట్టి తల్లి ఎవరూ' అంది రాధిక భర్తతో నెమ్మదిగా.

'ఎం.ఎ ఎకనామిక్స్ ఫైనలియర్ చదువుతున్న కృష్ణవేణి - అదే మా అందరికీ చిట్టి తల్లి - దాని పెళ్ళి గురించే అమ్మ చెప్తోంది' అన్నాడు భార్య కాలు గట్టిగా తొక్కి, నవ్వుతూ శ్రీరామ్.

రాధిక ముఖం ఒక్కసారి వెలవెల పోయింది. పెరటి తలుపు కిర్రుమన్న చప్పుడు చెవుల్లో దూరింది.

ఇప్పుడు రాధిక ఆలోచనలన్నీ కృష్ణవేణి మీదికి మరిలాయి - అత్తగారు మాట్లాడిన మాటలన్నీ పోగు చేస్తే ఎన్నో కొత్త విషయాలు తెలిశాయి. రాధికకి - ఈ కృష్ణవేణి అత్తకొడుకుని చేసుకోననీ, మామ కొడుకు చంద్రంనే చేసుకుంటానని పట్టుపట్టిందట తండ్రికి ఈ సంబంధం ఇష్టం లేదుట. పైగా పిల్ల దూరంగా వెళ్ళి పోతోందని కన్నీళ్ళు పెట్టుకుందిట శాంతమ్మ - కృష్ణవేణి పెళ్ళి కబుర్లు విన్న రాధికకి ఢిల్లీ సంబంధమే చేసుకుంటానంటే, తల్లికి ఇష్టంలేదని తెలియటంతో, ఈ హైదరాబాదు సంబంధం చేసుకుని హాయిగా కాపురం చేసుకోటం లేదూ తను! మరి ఈ కృష్ణవేణికి అంత ఇదేమిటీ, తల్లి తండ్రి వద్దంటున్నా ఆ అబ్బాయినే చేసుకుంటానని పట్టుపట్టడం? - ఏదయినా ఆ కృష్ణవేణికి మీద దురభిప్రాయాలు ఒకటి ఒకటి పెరిగి పోయాయి. దాని పెళ్ళికి నేను వెళ్ళను, అంతే - రాధికిలా అనుకుంటూ వుండగానే పెరటి తలుపు తోసుకుని.

'శ్రీరామ్ అన్నయ్యకి, శ్రీను అన్నయ్యకీ, నీకు అందరికీ ఇచ్చి రమ్మంది అమ్మ' అంటూ రెండు గిన్నెలు మూతలు పెట్టి లోపల వంటింట్లో పెట్టి వచ్చింది కృష్ణవేణి.

'అత్తయ్య ఇంకో, రెండు గంటలయ్యాక వస్తోందిట. చెప్పమంది' అంటూ పెరటి తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయిందవి కృష్ణవేణి.

ఆ గిన్నెల్లో తెచ్చిన పులిహోర, పెరుగు వడలు తిందామనుకుంది ఒక నిముషం రాధిక. కానీ పెరటి తలుపు మీద, కృష్ణవేణి మీద వున్న కోపం పెరుగు వడల మీదికి, పులిహోర మీదికి పోయేసరికి...

'ఏం నేను హోటలుకెళ్ళి ఐస్క్రిము తినలేనా' అనుకుంది మనసులో.

ఓ అరగంట అయ్యాక వంటింట్లోకెళ్ళి వచ్చిన శ్రీరామ్..

'ఎంత బావున్నాయో, నువ్వు తిన్నావా' అన్నాడు.

'ఆ చాలా బావున్నాయి.. తిన్నాను' అంది రాధిక పుస్తకంలోంచి తల తీయకుండానే!

కృష్ణవేణి పెళ్ళి హడావిడంతా యశోదమ్మ ఇంట్లోనే వుందన్నట్టుగా అంతా బిజీ బిజీగా ఆ పెరటి గుమ్మంలోంచి అటు ఇటు తిరగటం చూస్తున్న రాధిక ఒళ్ళు మండిపోయింది.

'ఈ పెరటి తలుపు మూయిస్తే కానీ వాళ్ళ పని కుదరదు' అనుకుంది చాలా గాఢంగా మనసులో కానీ ఆ గుమ్మం ఎలా మూయించ గలదు?

ఎన్నేళ్ళ నాటిది గుమ్మం – ఆ బంధం! అనుబంధం?!?!

రాధిక తన ఆలోచనకి రూపం కోసం వెతుక్కోటం మొదలు పెట్టింది.

ఓరోజు రాత్రి పెరటి తలుపు తాళం వేసి కనపబటంతో విస్తుపోయింది యశోదమ్మ.

'ఈ తాళమేమిటీ' అంది కోపంగా, తాళం తీస్తూ పొద్దున్నే.

'నేనే వేసాను... ఈ మధ్య దొంగతనాలు ఎక్కువయ్యాయని అందరూ చెప్తున్నారు–' నసిగింది రాధిక.

ఇంకా నయం, ఇన్నేళ్ళుగా లేని దొంగలు ఇప్పుడెక్కడనుంచి వచ్చారూ... ఆ తలుపుకి తాళం వేయడానికి వీల్లేదు' అంది ఖచ్చితంగా యశోదమ్మ.

'బావుంది... ఆ తలుపులు తీసి ఆ ఇంట్లోంచి ఈ ఇంట్లోంకి ఈ ఇంట్లోంచి ఆ ఇంట్లోకి తిరుగుతునే వుంటారు అంతా... ఎవరెవరో ఎవరికేం తెలుసూ... మొన్న దొడ్లో దండెం మీద ఆరేసిన చీర కనిపించ లేదు' అంది రాధిక.

యశోదమ్మ రాధిక మాట వినిపించుకోలేదు. ఆ సంభాషణ అవుతుండగానే..

'ఈ తియ్య గుమ్మడికాయ మా తమ్ముడు తెచ్చాడు. పులుసులో వేసుకోండి– మన శీనయ్యకి తియ్య పులుసు ఇష్టం కదూ' అంటూ తలుపు తోసుకు లోపలకొచ్చి గుమ్మంలో చతికిల బడింది శాంతమ్మ.

శాంతమ్మ యశోదమ్మ ఆ కబురు ఈ కబురు చెప్పుకున్నాక 'ఈ పూట నీ భోజనం అక్కడే, చెప్దామనే వచ్చా–' 'పదహార్రోజులు పండగ' అంది శాంతమ్మ లేస్తూ.

'ఇంట్లో పని చూసుకుని వస్తా' అంది యశోదమ్మ. రాధిక ముఖం కందిపోయింది.

"ఏం, నన్నూ రమ్మనచ్చుగా' అంది పైకి యశోదమ్మ నవ్వేసి ఊరుకుంది.

రాధిక స్వభావం నిజానికి యశోదమ్మకి నచ్చదు. కానీ ఏదో చిన్న పిల్ల అని కొన్నిసార్లు, తల్లితండ్రుల పెంపకం అలాంటిది. ఒక్కరు ఇంటికొచ్చి ఓపూట

భోజనం చేయటం కూడా ఇష్టముండదు, కానీ ఆ పద్ధతులు ఇక్కడ సాగవు అని మరోసారి 'అయినా నేనున్నంత వరకు ఇవన్నీ తప్పవు, తరవాత ఎవరిష్టం వారిదీ' అని మరోసారి మనసులో అనుకుంటూ, కోడలిని ఏమన్నా అంటే కొడుకు మనసు బాధ పడుతుందని ఎన్నిటికో సర్దుకు పోతూ వుంటుంది యశోదమ్మ!!

రెండు రోజులు వరుసగా పగలు. రాత్రి తాళం వేస్తూంది రాధిక ఆ పెరటి తలుపుకి. ఆ విషయంలో భర్త శ్రీరామ్, మరిది శ్రీను, అత్తగారు, చిన్నాడబిడ్డ జానకి అంతా వ్యతిరేకించారు. అందరికీ కోపం వచ్చింది. తలుపు పైనించి గోంగూర పచ్చడి గిన్నె అందించింది శాంతమ్మ, యశోదమ్మకి ఇష్టమని దొడ్లో పూసిన గులాబీలు అటు అందించింది యశోదమ్మ.

రాధిక అంతా గమనిస్తూనే వుంది పట్టుదల మరీ ఎక్కువై, అహం వంద రెట్లు పెరిగిపోయి, వివేకం పూర్తిగా నశించిన రాధిక ఆ రాత్రి భర్తతో చాలా ఘర్షణ పడింది.

'అమ్మ ఉన్నంతకాలం ఆ పెరటి తలుపు తాళం వేయడానికి వీల్లేదు. ఆ పెరటి గుమ్మంలో నిలబడి మాట్లాడుకోటంలో ఉన్న ఆనందం నీకు తెలియటం చాలా కష్టం - ఈ విషయం ఇంకోసారి మాట్లాడద్దు -- శ్రీరామ్ పడగ్గదిలోంచి కోపంగా బయటకిచ్చేసాడు.

రాధిక నాగిని ఐంది ఆ క్షణం నుంచీ! ఆర్నెల్లయింది కృష్ణవేణి పెళ్ళయి.

'ఇదిగో వదినా... అమ్మాయి అల్లుడు వస్తున్నారు ఎల్లుండి, అల్లుడి చెల్లెలి పెళ్ళిట. అందుకని ఓ ఇరవై రోజులు సెలవు పెట్టుకుని వస్తారుట. ఆ దేశం నచ్చలేదుట ఇక్కడేదయినా ఉద్యోగం వస్తే వచ్చేస్తానంటున్నాడు అతను. ఒదినా అసలు విషయం మరిచాను' శాంతమ్మ కొంచెం గొంతు తగ్గించింది.

యశోదమ్మ గొంతు పెంచి 'అయితే త్వరలోనే అమ్మమ్మవయిపోతావు... శుభవార్త చెప్పావు' అంది సంతోషంగా శాంతమ్మతో.

రాధిక చెవికి వినిపిస్తునే వున్నాయి ఈ మాటలన్నీ... అదే, ఇంక కృష్ణవేణి, దాని మొగుడు, దాని పిల్లలు - అంతా ఈ గుమ్మంలోంచి ఆ గుమ్మంలోకి, ఆ గుమ్మంలోంచి ఈ గుమ్మంలోకి - తప్పదన్న మాట - ఈ పీడవదలదు!! రాధిక కోపం పట్టలేక పోయింది - ఇంక ఆ కృష్ణవేణి పిల్లాడిని అంతా నెత్తికెక్కించుకుని ముద్దులాడుతారు - అత్తగారయితే సొంత మనుమడల్లేనే ఎత్తుకు తిరుగుతుందిక - అయినా పెళ్ళయి ఆర్నెల్లు కాలేదు - మూడు నెలల కడుపా - ఛీ, ఏం ఓ రెండేళ్ళు ఆగచ్చుగా! - అందుకే ఆ కృష్ణవేణికి గర్వం!!

ఏమన్నా కానీ, తను పెళ్ళయ్యాక మూడేళ్ళవరకు పిల్లలు వద్దని తను అనుకుంది. అంతే!! అత్తగారికోసం, మరొకరి కోసం కంటుందా తనూ!! రాధిక తనలో తనే అనుకుంటూ కేలండరు వంక చూసింది. తనకి పెళ్ళయి ఇంకో నెలలో మూడేళ్ళు పూర్తవు తాయా!! ఒక్క క్షణం కళ్ళు మూసుకుంది రాధిక.

కాలం గిర్రున పరిగెత్తింది. శ్రీను విశాఖ పట్నం ఉద్యోగానికొచ్చేశాడు. జానకి పెళ్ళయి అత్తవారింటికెళ్ళి పోయింది. ఆ ఇంటి యజమాని, యశోదమ్మ భర్త అయిన రామేశ్వరరావుగారు రిటైరయి, హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నారు.

అర్ధరాత్రి మొదలైంది. తుఫాను - ఉరుములు, మెరుపులు, చెట్లు పడిపోతున్నాయి. రయ్‌మనే పెద్ద శబ్దంతో గాలి... కిటికీలు, తలుపులు కొట్టుకుంటున్నాయి. యశోదమ్మ అటు ఇటు గదిలో తిరుగుతోంది. కొడుకూ కోడలు ఉన్నగదిలోకి తొంగి చూసింది.

'ఒరేయ్' అంది గుమ్మం బయట నిలబడి.

గదిలోంచి బయటకొచ్చాడు శ్రీరామ్. తల్లీ కొడుకుని పది నిముషాలు మాట్లాడుకున్నారు.

'కూతురు, అల్లుడు కూడా ఉన్నారు అమెరికా నుంచి వచ్చి. మనింటికన్నా పాతది - పైగా అటువైపు గోడలు ఎప్పుడో పడిపోయేట్టున్నాయి. అందుకనే నాకు మనసు మనసులో లేదు... అందరినీ ఇటు వచ్చేయమను. తుఫాను తగ్గాక వెళ్ళచ్చు.' అంది శ్రీరామ్ ఒక్క నిముషం నిలబడ్డాడు. పడగ్గదిలో కర్టెను కదలటం చూడక పోలేదు!! క్షణంలో పెరటి తలుపు తెరుచుకుంది. మానవత్వం పరవశించింది!! పది నిముషాల్లో శాంతమ్మ కుటుంబమంతా యశోదమ్మ ఇంట్లోకొచ్చారు.

'ఇప్పుడు నా ప్రాణం హాయిగా వుందే శాంతా... ఈ తుఫానుకి మీ ఇల్లు నిలవదనే నా భయం' అంది యశోదమ్మ.

కృష్ణవేణి, భర్త జానకి వుండే గదిలోకి వెళ్ళారు. వీరయ్యగారు ముందు గదిలో సోఫాలో పడుకున్నాడు. రామేశ్వర రావుగారు హాల్లో ఓ మూల మంచం వేసుకున్నారు.

పడగ్గదిలో రాధిక కళ్ళు నిప్పులు కురుస్తుంటే ఈ తుఫాను తనకో ఓటమి అని దుఃఖ పడిపోయింది.

క్షణాలలో తుఫాను వేగం పెరిగిపోయింది. అంతలోనే నలభై ఏళ్ళనాటి పెరటి గోడ ఒక్కసారి కూలి పడిపోయింది.

'అయ్యో!', అంది యశోదమ్మ పెరటి తలుపు వూడి కింద పడిపోడం చూసి.

'మంచిపని అయింది' మనసులో మురిసి పోయింది రాధిక. కానీ, ఆ పడిపోటం మంచి పనే!!

నెల రోజులయే సరికి కొత్త గోడ, ఆ గోడకి అందమైన మంచి తలుపు బిగించబడ్డాయి.

'వదినా ఈ తుఫాను మనకి మేలేచేసిందమ్మా... ఈ తలుపు ఎప్పుడు పడిపోతుందోనని భయపడేదాన్ని' అంది యశోదమ్మ.

'పెరటి గుమ్మం కళకల్లాడి పోతోంది వదినా... ఇంక మా మనుమడు గుమ్మంలోంచి మీ యింట్లోకి నడిచి వచ్చేస్తాడు' అంది శాంతమ్మ.

'ఎలాగైనా భర్తని ఒప్పించి ఈ పాత ఇల్లు, ఈ పెరటి గోడ మొత్తం కూలగొట్టించక పోతానా, ఏదో వాస్తు వంక పెట్టి ఈ పెరటి తలుపు మూయించక పోతానా' అనుకుంటూ కోపంగా భర్తకేసి చూసింది రాధిక. చేతిలో పేపరు విసిరి కొట్టి హాలులోకొచ్చాడు శ్రీరామ్. ఇంట్లో అన్నీ గమనిస్తూనే ఏమీ పట్టించుకోనట్టు వుండటం రామేశ్వర రావుకే సాధ్యం. మూడేళ్ళనాడు ఇంటికొచ్చిన కోడలు రాధికని, నలభై ఏళ్ళనుండి పెరటి గుమ్మం బంధాన్ని పెంచుకుంటున్న భార్య యశోదమ్మన్ని కొడుకుల్ని అందరినీ ఓ కంట కనిపెటుతుండే రామేశ్వర రావు ఈ మధ్య పెరటి గుమ్మం గురించి ఆలోచించడం మొదలు పెట్టాడు - ఇదో పెద్ద సమస్య అనుకున్నాడు -- డాబా పైన నిలబడి పెరటి గుమ్మాన్ని చూస్తూ రామేశ్వర రావు.

నెలరోజులయింది.

శ్రీరామ్ ఆఫీసు నించి వచ్చి అరగంటయింది.

'ఓసారి ఇలారా' తండ్రి గంభీరమైన గొంతు వినిపించింది శ్రీరామ్‌కి.

భర్త వెనక నిలబడింది రాధిక.

'మేడ మీద ఒక కిచెన్, హాలు, బెడ్ రూము వేయిస్తున్నాము. వారం రోజుల్లో పని మొదలు పెడతాడు కంట్రాక్టరు రాజు. ఆ విషయం చెప్తామని' రామేశ్వరరావు కళ్ళజోడు సరిచేసుకుని, పొద్దున్న చూసిన పేపరు మళ్ళా తిరగేయటం మొదలుపెట్టాడు.

కొడుకు శ్రీరామ్ ముఖం ఆ క్షణంలో వెలవెల పోయింది. అది తనకి గెలుపో, ఓటమో తెలియక ఖంగారుగా భర్త వైపు చూసింది రాధిక.

- రచన ఇంటింటి పత్రిక ఫిబ్రవరి 1998